ఆనందమానందమాయె..



టిడ్కో గృహసముదాయం



సత్యనారాయణస్వామి పూజలో పాల్గొన్న వై.వి.సుబ్బారెడ్డి, ఆడారి ఆనంద్‌కుమార్

అక్కడికి వచ్చిన ప్రతి నిరుపేద మోములో చిరునవ్వు.. తమ సొంతింటి కల నెరవేరిందన్న ఆనందం.. తమ నవ్వుల వెనుక జగన్ అనే వరం ఉందని సంబరపడ్డారు. కుటుంబ సభ్యులతో వచ్చి తమ ఇళ్లను చూసి మురిసిపోయారు. థ్యాంక్యూ సీఎం జగన్ అని రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆశీర్వదించారు.

జాతరలా టిడ్కో గృహాల ప్రారంభోత్సవం

- సందడిగా సామూహిక వ్రతాలు
- లబ్ధిదారులను ఆశీర్వదించిన సుబ్బారెడ్డి, ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 62వ వార్డు మల్కాపురం సమీపంలోని అచ్చెన్నాయుడుతోట ప్రాంతంలో మంగళవారం నిర్వహించిన టిడ్కో గృహ ప్రవేశాలు సందడిగా జరిగాయి. ఇక్కడ సుమారు 3984 గృహాలు నిర్మించారు. ఈ గృహాలను రాజ్యసభ సభ్యుడు,వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు పండగ వాతావరణంలో నిర్వహించారు. గృహాలను పొందిన లబ్ధిదారులను ఆశీర్వదించారు.అనంతరం వారికి నూతన వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నిరుపేద సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారన్నారు. అలాంటి నాయకుడు మన వెంట ఉంటే రాష్ట్రం మరింత ప్రగతి పథంలో నడుస్తుందని చెప్పారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి పేద వాని ఇంట చిరునవ్వులను జగన్ అనే నాయకుడు కురిపిస్తున్నాడని వివరించారు. మంచి పాలన అందిస్తున్న జగన్ వంటి నాయకుడు కావాలో..., పూటకో మాట,రోజుకో అబద్ధం చెప్పే నాయకులు కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి

పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. ఓర్వలేని వారి తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇచ్చిన మాట ప్రకారం నిరుపేద సొంతింటి కల నెరవేర్చిన జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్,యూసీడీ ప్రాజెక్ట్ డైరక్టర్ పాపునాయుడు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్లు బల్లా లక్ష్మణరావు,పి.వి.సురేష్,గుండపు నాగేశ్వర రావు,కొణతాల సుధ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరింది



సొంత ఇల్లు కోసం 20 ఏళ్లుగా ఎదురు చూస్తున్నాను. నిరుపేద కుటుంబానికి చెందిన నాకు అర్హత ఉన్నా గత ప్రభుత్వం పలు కారణాలు చూపుతూ ఇల్లు ఇచ్చేందుకు నిరాకరించింది.కానీ మా జగనన్న నా కల నెరవేర్చారు. జగనన్నకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను.

– సీహెచ్.పద్మవతి, కోరమాండల్ గేటు ఏరియా

సంతోషంగా ఉన్నాం



నిజంగా ఇలాంటి రోజు మాలాంటి వారి జీవితాల్లో వస్తుందని భావించలేదు. ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా అలాంటి మంచి రోజు నేడు రానే వచ్చింది. నా కుటుంబ సభ్యులతో వచ్చి సొంత ఇంట్లో గృహ ప్రవేశం చేశాం. చాలా ఆనందంగా ఉంది.

– బి.సన్యాసమ్మ, శ్రీనివాస్‌నగర్

జగనన్నకు రుణపడి ఉంటాం



మాలాంటి నిరుపేద ఇళ్లలో దీపాలు వెలిగించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రుణం ఓటు ద్వారా తీర్చుకుంటాం. సకల వసతులతో విశాలమైన ప్రదేశంలో మంచి ఇంటిని అందించిన నాయకుడు మా వెంట ఉండగా ఏమి భయం.

– నమ్మి పార్వతమ్మ, కంచరపాలెం

ఆనందంగా ఉంది



ఇన్నాళ్లకు నా కల నెరవేరింది.మాకు వచ్చిన సొంత ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి సత్యనారాయణస్వామి వ్రతం చేసుకున్నాం. మా వారి అందరితో కలిసి గృహ ప్రవేశం చేశాం. చాలా సంతోషంగా ఉంది.

– సత్యవతి, మల్కాపురం

ఇది ఒక వరం



ఎందరో నిరుపేద ముఖంలో చిరునవ్వులు కురిపించిన జగన్‌మోహన్‌రెడ్డి వంటి నాయకుడు మన రాష్ట్రంలో ఉండడం పేద ప్రజలకు వరం. నేటి రోజుల్లో మా వాళ్లం ఇలాంటి ఇంటిని నిర్మించుకోలేం, కానీ మాలాంటి వారి కోసం పలు వసతులతో చక్కటి ఇల్లు నిర్మించి ఇవ్వడం ఒక వరంలా ఉంది.

– బల్లా నవీన్‌కుమార్, కంచరపాలెం

పార్టీలో చేరిన దొడ్డి కిరణ్



దొడ్డి కిరణ్‌కు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు నాయకుడు దొడ్డి కిరణ్‌ను రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి కండువా వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. గతంలో దొడ్డి కిరణ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అయితే కొంతకాలంగా పార్టీ కోసం నిబంధనలకు కట్టుబడి పని చేయడంతో సస్పెన్షన్‌ను ఎత్తి వేసి పార్టీలో చేర్చుకున్నారు. మగళవారం అచ్చెన్నాయుడులోవలో జరిగిన టిడ్కో గృహప్రవేశాల వద్ద కిరణ్‌కు పార్టీలోకి సుబ్బారెడ్డి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. దొడ్డి కిరణ్ మాట్లాడుతూ పార్టీ అభీష్టం మేరకు పని చేస్తానని, పశ్చిమలో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తానని చెప్పారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని 59వ వార్డు నక్కవానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పార్టీ జెండాను ఎగురవేసి,దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీని స్థాపించిన 14 ఏళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని చెప్పారు.ప్రాంతీయ పార్టీ పెట్టిన ఏ నాయకుడు ఈ స్థాయిలో ఫలితాలు సాధించలేదన్నారు. జగన్‌కు ఒక కమిట్‌మెంట్ ఉందని, మాట ఇస్తే ఎంతటి కష్టం వచ్చినా నెరవేర్చుతారని వివరించారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్,శ్రీనివాస రాజు,బర్రి సంతోష్,వెంకటరమణి,సన్యాసిరావు,నర్సింగ్‌యాదవ్,సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.అలాగే 58,60,61వ వార్డుల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న గోపాలకృష్ణ

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు నాగేంద్ర కాలనీకి చెందిన షేక్ మాలిక్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10వేలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం అడగా నిలుస్తుందని చెప్పారు. మాలిక్ ఇటీవల చని పోవడంతో రూ. లక్ష వైఎస్సార్‌బీమా మంజూరైందని చెప్పారు. అందులో తక్షణ సాయంగా రూ.10వేలు అందించామన్నారు. మిగిలిన రూ.90 వేలు వారి ఖాతాలో జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో షేక్ రహమాన్, బాబ్జి, స్థానికులు పాల్గొన్నారు.

ప్రతి రంగుకూ అర్థం

సింథియా: ప్రకృతిని చూసి ప్రతి కళాకారుడు ఉత్తేజితుడై తన సృజనాత్మకతను ప్రదర్శిస్తాడని ప్రముఖ చిత్రకారుడు ద్వారంపూడి శ్రీనివాస్‌మనోహర్ అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో సెయింట్ ఆన్స్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్–1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిత్రరంగంలో ప్రతి రంగుకు ఒక అర్థం ఉందని, పరిశీలన, అనుకరణ వంటివి నూతన విషయాల సృష్టికి ఎంతో అవసరమన్నారు. అనంతరం చిత్రలేఖనంలోని మెలకువలను విద్యార్థులకు వివరించారు. ఎస్.చలపతిరావు మాట్లాడుతూ పత్రికలు దేశ సమస్యలను వివరిస్తాయని, ప్రతి ఒక్కరూ పత్రికలు చదవాలని సూచించారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి ఎన్నికల సంస్కరణలపై ప్రసంగించారు.

గీతాంజలి ఆత్మహత్యకు కారణమైన వారిని శిక్షించాలి



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు తదితరులు

సింథియా: తెనాలికి చెందిన గీతాంజలి టీడీపీ, జనసేనకు చెందిన సోషల్ మీడియాలో ట్రోల్ చేయడం వల్లే ఆత్మహత్య చేసుకుందని.. ఆమెను వ్యక్తిగతంగా టార్గెట్ చేసిన వారిని శిక్షించాలని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వల్ల భరోసా లభించందని సంతోషంగా మాట్లాడితే ఆమెను ట్రోల్ చేయడంతో భరించలేక ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. గీతాంజలిని ట్రోల్ చేసిన వారిని పట్టుకుని కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి భోగవిల్లి నాగభూషణం , సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పోర్టులో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

జగదాంబ: పోర్టులోని వేదాంత కంపెనీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అదే కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న పోతనపల్లి రాజేశ్వరరావు మంగళవారం మధ్యాహ్నం వీపీటీ సరిహద్దులోని ఔటర్ గోడ రైల్వే ట్రాక్ ఎదురుగా ఈ మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే హార్బర్ పోలీసులు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. చనిపోయిన వ్యక్తి వయసు 50 నుంచి 55 ఏళ్లు ఉంటుందని, మృతదేహం కుళ్లిపోయి ఉందన్నారు. నీలం రంగు షర్ట్, బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. అతని ఆచూకీ తెలిసిన వారు 91548 79915లో సంప్రదించాలని కోరారు.

అందుబాటులోకి యల్లపువానిపాలెం హాస్టల్

పునఃప్రారంభించిన కలెక్టర్ మల్లికార్జున



హాస్టల్ పునఃప్రారంభంలో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, డీఈవో చంద్రకళ తదితరులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెంలోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహాన్ని ఇటీవల ఆధునికీకరించారు. ఈ పనులు పూర్తి కావడంతో మగళవారం కలెక్టర్ మల్లికార్జున పుఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో ఆధునిక సౌకర్యాల కల్పన కోసం కృషి చేశామన్నారు. ఇక్కడి హాస్టల్ ఆధునికీకరణకు రూ.27.10 లక్షలు వెచ్చించామని తెలిపారు. బలహీన వర్గాల వారు విద్యావంతులు కావడానికి సంక్షేమ హాస్టళ్లను మెరుగుపరిచామని చెప్పారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కె. రామారావు, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్. చంద్రకళ, సమగ్ర శిక్షా ప్రాజెక్టు అధికారి బి. శ్రీనివాసురావు, ఈఈ డీపీ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఇళ్ల పట్టాల పంపిణీ



యల్లపువానిపాలెంలో లబ్ధిదారునికి పట్టా అందిస్తున్న గోపాలకృష్ణ, మురళీకృష్ణ తదితరులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు భీమిలి నియోజకవర్గం పరిధిలోని యల్లపువానిపాలెంలో ఇళ్ల పట్టాల పంపిణీ సందడిగా జరిగింది. వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ లబ్ధిదారులకు సెంట్ ఇళ్ల పట్టాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరత్నాల్లో భాగంగా అర్హులైన పేదలకు ఇళ్లు అందిస్తానని ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా ఇచ్చారన్నారు. మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్‌కు మనమంతా అండగా నిలవాలని కోరారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పసుపురెడ్డి నర్సింగరావు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు దాడి రమేష్, నాయకులు ధీశెట్టి హరి, పాలమరశెట్టి విజయ్, సాయిరామ్, ఇందల రాజమ్మ, కాళ్ల లక్ష్మి, బొజ్జ గణేష్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో ప్రతీ ఓటర్‌ను కలవాలి

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు



పద్మనాభనగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: బూత్ స్థాయిలో ప్రతీ ఓటర్‌ను కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను వివరించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు సూచించారు. జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనర్‌లో మంగళవారం నిర్వహించిన మేము సిద్ధం– మా బూత్ సిద్ధం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న విధానాన్ని వివరించారు. గత ప్రభుత్వంలో మేనిఫెస్టో అమలు చేయకుండా ప్రజలను ఎలా మోసం చేశారో తెలిపారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత చేసిన మేలును గణాంకాలతో సహా వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సంక్షేమ పాలనకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సాలాపు మారయ్య, దవళ గోపాల్, కంపర కోటేశ్వరరావు,స్థానికులు నర్సింగరావు, నాగరాజు, మధు, ప్రసాద్, కాళ్ల శ్రీదేవి, లక్ష్మి, సంతోషి, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో ఐటీ సభ్యుల పాత్ర కీలకం

జేసీ కె.మయూర్ అశోక్



యాప్ కోసం వివరిస్తున్న ఎన్ఐసీ అధికారి, పాల్గొన్న జేసీ మయూర్ అశోక్, ఏడీసీ విశ్వనాథన్

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ఐటీ సభ్యుల పాత్ర చాలా కీలకమని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. ఐటీ అప్లికేషన్స్, యాప్స్ వినియోగం, తదితర అంశాలపై వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వివిధ విభాగాల నుంచి ఎంపికైన ఐటీ టీం సభ్యులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్‌తోపాటు పాల్గొన్న జేసీ పలు అంశాలపై మాట్లాడారు. ఐటీ టీం సభ్యులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ ఏం జరిగినా జిల్లా కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. ఎన్నికల నియమావళి దాటి ఎవరు ప్రవర్తించినా, ఉల్లంఘనలకు పాల్పడినా సీ విజిల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులు, ఇతర అంశాలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఐటీ అప్లికేషన్లు, సి.విజిల్ యాప్ వినియోగంపై ఎన్ఐసీ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డెమో ఇచ్చారు. ఆయా నియోజకవర్గాల ఏఆర్వోలు, ఏఈఆర్వోలు, ఐటీ బృంద సభ్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు బంటాకాలనీలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయ 12 వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి జాతర



దుర్గాదేవికి పూజలు చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు దుర్గాపురంలో మంగళవారం దుర్గాదేవి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్, వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి పాల్గొని దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలందరూ సకల సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్టు ఆనంద్‌కుమార్ చెప్పారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ కన్వీనర్లు, నాయకులు కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సీఎం జగన్‌తో సాకారం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సింథియా: రాష్ట్రంలో ఇళ్లు లేని పేదల సొంతింటి కల తీర్చడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ అన్నారు. అందులో భాగంగా సొంత ఇల్లు లేని వారిలో కొందరికి టిడ్కో ఇళ్లు , మిగిలిన వారికి సెంటు స్థలం అందించారని చెప్పారు. జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల పంపిణీ కార్యక్రమంలో బద్రీనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి సీఎం జగన్ కట్టుబడి ఉన్నారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు దోచుకున్నాయని విమర్శించారు. పేదలకు ఇళ్లు అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై కోర్టులో కేసులు పెట్టి ఆపే ప్రయత్నం చేశారని, కానీ న్యాయం గెలిచి నేడు పేదప్రజలకు సీఎం జగన్ ఉచితంగా ఇళ్లలను అందిస్తున్నారన్నారు. 3వ వార్డు పరిధిలో సుమారు 260 మంది టిడ్కో , 350 మంది సెంటు ఇంటి స్థలం పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

305 మందికి వైద్య పరీక్షలు



మందులు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు పాత కరాసలో ఆడారి తులసీరావు ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఆడారి ఆనంద్ కుమార్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ద్వారా నిర్వహిస్తున్న కంటి వైద్యశిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. సుమారు 305 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 50 మందికి ఆపరేషన్లు, మరో 50 మందికి అవసరమైన కళ్లద్దాలు అందించనున్నట్టు ట్రస్టు సభ్యులు తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ, జియ్యాని మారుతీ, శ్రీదేవి వర్మ పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ భవనం ప్రారంభం



ఫిజియోథెరపీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

కూర్మన్నపాలెం: దివ్యాంగ చిన్నారులకు అవసరమైన వసతులు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. అభయ ఫౌండేషన్–హైదరాబాద్, స్పందన చేయూత ఫౌండేషన్ సౌజన్యంతో వడ్లపూడి భవిత కేంద్రంలో అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసిన హైడ్రోథెరపీ, సాండ్ థెరపీలతో కూడిన ఫిజియెథెరపీ నూతన భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిత కేంద్రాలకు విచ్చేస్తున్న చిన్నారులకు ఫిజియోథెరపీ కోసం ఏర్పాటు చేసిన భవనాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. దివ్యాంగ చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భవిత కేంద్రాలకు ప్రభుత్వం భరోసా కల్పించనుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్రశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యం, అభయ ఫౌండేషన్, స్పందన చేయూత ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ సభను విజయవంతం చేయాలి



ప్రసంగిస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఈ నెల 15న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన పోరాట కమిటీ సమావేశంలో నాయకులు మాట్లాడారు. ప్లాంట్ పరిరక్షణ కోసం మూడేళ్ల నుంచి కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నామని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా ముందుకు వచ్చిందని అన్నారు. ఇందులో భాగంగా త్రిష్నా మైదానంలో ఆ రోజు సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న సభకు తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిల హాజరవుతున్నందున ఉక్కు ఉద్యోగులు, నిర్వాసితులు తమ కుటుంబ సభ్యులతో సభకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, వై.మస్తానప్ప, జి.గణపతి రెడ్డి, జెర్రిపోతుల ముత్యాలు, డి.వి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమా వ్యాధిపై అవగాహన అవసరం

- కంటి వైద్యుడు డాక్టర్ రవీంద్ర

సింహాచలం: గ్లకోమా అనేది నిశ్శబ్దంగా కంటి చూపును అపహరించే ప్రమాదకర వ్యాధి అని, ఈవ్యాధిపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ రవీంద్ర తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో మంగళవారం నుంచి ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆస్పత్రి నుంచి వేపగుంట వరకు పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ గ్లకోమా వ్యాధి నివారణకు ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శంకర్ ఫౌండేషన్‌లో అన్ని రకాల కంటి శస్త్ర చికిత్సలకు మెరుగైన వైద్యం అందిస్తోందని తెలిపారు.కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లక్ష్మి, డాక్టర్ మంజువల్లి, డాక్టర్ కవితాదేవి, డాక్టర్ సవర్ణ, డాక్టర్ శశి, డీజీఎం కె.బంగార్రాజు,ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.